సాక్షి
నిజామాబాద్
శుక్రవారం । 26 । జనవరి । 2024





## పాన్‌షాపులో గంజాయి..

నగరంలోని గుర్బాబాది రోడ్డులో గల ఓ పాన్‌షాపులో టాస్క్‌ఫోర్స్ అధికారులు గంజాయి పట్టుకున్నారు.

- IIలో ▸




## క్రీడాకారుల ప్రతిభ

రాష్ట్రస్థాయి తైక్వాండో సబ్‌జూనియర్ పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు ప్రతిభ కనబర్చారు.

- IIలో ▸

గరిష్టం/కనిష్టం
27.5 /16.0

## వాతావరణం

ఉదయం ఈదురుగాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి చలి తీవ్రత కొనసాగుతుంది. పొగమంచు కురియవచ్చు.

### న్యూస్‌రీల్

#### ఢిల్లీలో గణతంత్ర వేడుకలకు బోధన్‌వాసులు



**బోధన్:** పట్టణంలోని ఎల్‌బీఎస్ నగర్ కాలనీకి చెందిన నేషనల్ ఫిషరీస్ ఫెడరేషన్ జాతీయ ప్రతినిధి అక్కపల్లి ఉదయ్ కుమార్ దంపతులు ఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకలకు ప్రత్యేక ఆహ్వానితులుగా ఎంపికయ్యారు. మత్స్య పారిశ్రామిక సహకార సంఘం విభాగం నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఉదయ్ కుమార్ దంపతులను ఎంపిక చేసినట్లు బోధన్ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు కోట అబ్బయ్య గురువారం తెలిపారు. వారి ఎంపికపై సహకార సంఘం ప్రతినిధులు భూమయ్య, సుల్తాన్, సాయిలు, నడిపి లక్ష్మయ్య హర్షం వ్యక్తం చేశారు.

#### జంతు సంరక్షణకు కృషి చేయాలి



**డొంకేశ్వర్(ఆర్మూర్):** జంతు సంరక్షణపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అన్నారు. జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి 30వ తేదీ వరకు జంతు సంక్షేమ పక్షోత్సవాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో గురువారం కలెక్టర్ చేతుల మీదుగా కర పత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూగ జీవాలపై జాలి, కరుణ, దయ కలిగి ఉండాలన్నారు. జంతువులను ఎట్టి పరిస్థితుల్లో ఇబ్బంది పెట్టే పనులు చేయకూడదన్నారు. అయితే, జంతువుల సంక్షేమంపై పాఠశాల స్థాయి విద్యార్థులకు అవగాహన కల్పించాల ని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సీపీ కల్మేశ్వర్, అదనపు కలెక్టర్లు యాదిరెడ్డి, చిత్రామిశ్రా, మున్సిపల్ కమిషనర్ మకరందు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి జగన్నాథచారి, బాలిక్ అహ్మద్ పాల్గొన్నారు.

#### సకాలంలో సిలబస్ పూర్తిచేయాలి

**నిజామాబాద్‌అర్బన్:** జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సకాలంలో సిలబస్ పూర్తిచేయాలని పీడీఎస్‌యూ ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం నగరంలో డీఐఈవోకు వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కేవలం ఇప్పటివరకు 70 శాతం మాత్రమే సిలబస్ పూర్తయిందని, వెంటనే పూర్తి చేయాలన్నారు. ప్రాక్టికల్స్ దగ్గరికి వస్తున్నా, చాలా కాలేజీల్లో పరికరాలు లేవన్నారు. కార్యక్రమంలో నాయకులు వంశీ, గంగాధర్, గణేశ్, సజన్, సిద్దార్థ, నవతేజ్, శంకర్ సింగ్ పాల్గొన్నారు.

# ధాన్యం.. పక్కదారి!

- జిల్లాలోని మిల్లుల్లో అధికారుల విస్తృత తనిఖీలు
- రూ. 40 కోట్ల విలువైన ధాన్యం అమ్ముకున్నట్లు గుర్తింపు
- ఏడుగురు రైస్‌మిల్లర్లపై క్రిమినల్ కేసులు
- మరో ఇద్దరిపై పోలీసులకు ఫిర్యాదు
- రైస్‌మిల్లర్లలో కలవరం



వర్నిలోని రైస్‌మిల్లును తనిఖీ చేస్తున్న సివిల్ సప్లయ్స్ అధికారులు

**సుభాష్‌నగర్/వర్ని/బోధన్:** కస్టం మిల్లింగ్ రైస్(సీఎంఆర్)ను పలువురు మిల్లర్లు భారీగా పక్కదారి పట్టించారు. జిల్లాలోని పలు రైస్‌మిల్లుల్లో గురువారం పౌరసరఫరాలశాఖ అధికారులు విస్తృతంగా తనిఖీలు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. సుమారు 1,16,245 క్వింటాళ్లకు సంబంధించి రూ. 40 కోట్ల విలువైన ధాన్యం పక్కదారి పట్టించినట్లు గుర్తించారు. అక్రమాలకు పాల్పడిన ఏడుగురు రైస్‌మిల్లర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. అనుమానం ఉన్న మరో ఇద్దరిపై అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లాలోని రైస్‌మిల్లర్లలో కలవరం మొదలైంది. అధికారులు సమగ్రంగా విచారణ చేపడితే రూ. వందల కోట్ల అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశముందని మరికొందరు మిల్లర్లు పేర్కొంటున్నారు.

**అమ్ముకుంటూ.. సొమ్ము చేసుకుంటూ..**

ప్రభుత్వం నుంచి పొందిన ధాన్యాన్ని రైస్‌మిల్లర్లు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. ధాన్యానికి సంబంధించి సీఎంఆర్ సకాలంలో ఇవ్వని మిల్లులపై సివిల్ సప్లయ్స్ అధికారులు విచారణ చేపట్టారు. ఏడుగురు రైస్‌మిల్లర్లు రూ. 40 కోట్ల విలువైన ధాన్యాన్ని పక్కదారి పట్టించినట్లు విచారణలో తేలింది.

సుమారు 1,16,245 క్వింటాళ్ల ధాన్యం అమ్ముకున్నట్లు తెలిసింది. ఇప్పటికే ఆయా మిల్లులపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. వారి నుంచి ఆ మొత్తాన్ని రికవరీ చేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. గతంలోనూ ఇదేవిధంగా ధాన్యం పక్కదారి పట్టించిన మిల్లులపై క్రిమినల్ కేసులు నమోదయ్యాయి.

**కేసులు నమోదైన మిల్లులివే..**

వర్ని మండలంలోని ఎంఎస్ఆర్ ఆగ్రో ఇండస్ట్రీస్, రాయల్ ట్రేడింగ్ కంపెనీ, ఎస్ఏఆర్ ట్రేడర్స్, గంగా రైస్‌మిల్లు, నవీపేట్ మండలంలోని యూనుస్ ట్రేడర్స్, నిజామాబాద్ రూరల్ మండలంలోని శ్రీ లక్ష్మీగణపతి నర్సింహా ఆగ్రో ఇండస్ట్రీస్, బోధన్‌లోని దాదా బాయి ఇండస్ట్రీస్‌పై క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. అలాగే వర్ని మండలంలోని వసి పారాబాయిల్డ్ రైస్‌మిల్, అర్కామ్ ట్రేడర్స్‌పై పోలీసులకు పౌరసరఫరాలశాఖ అధికారులు ఫిర్యాదు చేశారు. సీఎంఆర్ ఇవ్వకపోగా, అధికారులకు సహకరించడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

### గడువులోగా ఇవ్వకపోవడంతో..

రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని సీఎంఆర్ కోసం రైస్‌మిల్లులకు కేటాయిస్తోంది. జిల్లా వ్యాప్తంగా 308 వరకు రా, బాయిల్డ్ రైస్ మిల్లులు ఉన్నాయి. ప్రతి సీజన్‌లో సగటున 200 రా రైస్‌మిల్లులకు, 65 బాయిల్డ్ రైస్‌మిల్లులకు పౌరసరఫరాలశాఖ అధికారులు ధాన్యాన్ని కేటాయిస్తారు. క్వింటాలు ధాన్యానికి 67 కిలోల బియ్యం చొప్పున సివిల్ సప్లయ్, ఎఫ్‌సీఐకి ఇవ్వాల్సి ఉంటుంది. సీఎంఆర్ కోసం ఇచ్చిన ధాన్యాన్ని నిర్దేశిత గడువులోగా ఇవ్వకపోవడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు విచారణ చేపట్టారు. 2021, 2022 సీజన్లకు సంబంధించి సీఎంఆర్ ఇవ్వకుండా రైస్‌మిల్లర్లు కాలయాపన చేస్తుండడంతో ఇటీవల తనిఖీలు చేశారు. ఆయా మిల్లుల్లో అధికారులు విచారణ చేపట్టి కలెక్టర్‌కు నివేదించారు.

### సమగ్ర విచారణ చేపడితే..!

జిల్లాలోని రైస్‌మిల్లుల్లో రూ. వందల కోట్ల అవినీతి జరుగుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అనేక మంది రైస్‌మిల్లర్లు ధాన్యం అమ్ముకున్నట్లు విమర్శలున్నాయి. ఇటీవల బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్‌కు సంబంధించిన మిల్లుల్లో రూ. 70 కోట్ల విలువైన ధాన్యం అమ్ముకుని అవినీతికి పాల్పడినట్లు వార్తలొచ్చాయి. కొంత ధాన్యం ఇతర మిల్లులకు అప్పగించినట్లు ప్రకటించినా.. దీనిపై పూర్తిస్థాయిలో నిజానిజాలు తెలియాల్సి ఉంది. కాగా సీఎంఆర్ పెండింగ్‌లో ఉంచిన అన్ని మిల్లుల్లోనూ తనిఖీలు చేపడతామని, ధాన్యాన్ని అమ్ముకున్న ఏ మిల్లరును వదిలిపెట్టబోమని పౌరసరఫరాల శాఖలోని ఓ అధికారి తెలిపారు.

అధికారంలోకి రావడం

# బీజేపీకి చిన్న విషయమే!



వేదికపై ఐక్యత చాటుతున్న ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యే ధన్‌పాల్, రాష్ట్ర నాయకులు యెండల, గంగారెడ్డి

- ఎన్నికల్లో డబ్బు ఖర్చు పెడితే అవినీతికి ఆస్కారం
- కాంగ్రెస్ ఏ ఒక్క హామీ అమలు చేయడం లేదు
- రాష్ట్ర ప్రభుత్వం ముందుకొస్తే చక్కెర ఫ్యాక్టరీలను తెరిపిస్తాం
- ఎంపీ అర్వింద్ ధర్మపురి
- బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన దినేశ్ కులాచారి



బాధ్యతలు స్వీకరిస్తున్న దినేశ్ కులాచారి

**సుభాష్‌నగర్:** తెలంగాణలో అధికారంలోకి రావడం బీజేపీకి చిన్న విషయమేనని, ఎవరూ ఆపలేరని ఎంపీ అర్వింద్ పేర్కొన్నారు. కాంగ్రెస్ స్వల్ప మెజార్టీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిందని, రెండు నెలలు కావస్తున్నా.. ఏ ఒక్క హామీని అమలు చేయడం లేదని విమర్శించారు. ప్రధాని మోదీ ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని అమలుచేసి చూపించారన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా దినేశ్ కులాచారి బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో ఎంపీ మాట్లాడారు. అయోధ్యలో బాలరాముని ప్రాణప్రతిష్ట తర్వాత ఈ కార్యక్రమానికి హాజరయ్యానని, రాముడి ఆశీస్సులు దినేశ్ కులాచారిపై ఉంటాయన్నారు. దినేశ్ ఆధ్వర్యంలో వచ్చే అన్ని ఎన్నికల్లో జిల్లాలో బీజేపీ క్లీన్ స్వీప్ చేయాలని ఆకాంక్షించారు. బీజేపీ అంచెలంచెలుగా ఎదుగుతోందని, పార్టీ ఎదుగుదలలో అందరి భాగస్వామ్యం అవసరమన్నారు.

**రాష్ట్ర ప్రభుత్వం ముందుకురావాలి**

రాష్ట్రంలోని షుగర్ ఫ్యాక్టరీలు తెరిపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రావాలని, కేంద్రం నుంచి సహకారం ఉంటుందని ఎంపీ పేర్కొన్నారు. పసుపు ధర రూ.20వేలు దాటిస్తానని, అప్పటి వరకు నిద్రపోనన్నారు. బీజేపీ కార్యకర్తలకు ఎన్నికల్లో డబ్బులు ముఖ్యం కాదని, డబ్బులు ఖర్చు పెడితే అవినీతికి పాల్పడే ఆస్కారముంటుందన్నారు.

**సమన్వయంతో పనిచేస్తా : దినేశ్ కులాచారి**

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించడం అదృష్టంగా భావిస్తున్నానని దినేశ్ కులాచారి పేర్కొన్నారు. ఎన్ని జన్మలెత్తినా కార్యకర్తలు, నాయకుల రుణం తీర్చుకోలేనన్నారు. బీజేపీ క్రమశిక్షణ గల పార్టీ అని, ఐక్యంగా, సమన్వయంతో, సమష్టిగా మరింత బలోపేతం చేస్తానన్నారు. కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ, రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, మాజీ అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య పార్లమెంట్ ప్రభారీ వెంకటరమణి, మాజీ జిల్లా అధ్యక్షుడు బద్దం లింగారెడ్డి, వడ్డీ మోహన్‌రెడ్డి, గద్దె భూమన్న, పంచరెడ్డి లింగం, స్రవంతిరెడ్డి, పద్మారెడ్డి, అడ్లూరి శ్రీనివాస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఏడాదిన్నరలో బ్రిడ్జి పూర్తవ్వాలి

- ఎంపీ అర్వింద్ ధర్మపురి
- అర్సపల్లి ఆర్వోబీ పనులకు ఎమ్మెల్యే ధన్‌పాల్‌తో కలిసి శంకుస్థాపన



ఆర్వోబీ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ అర్వింద్

**సుభాష్‌నగర్:** అర్సపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణాన్ని ఏడాదిన్నరలో పూర్తి చేసి ప్రయాణికులకు అందుబాటులోకి తేవాలని ఎంపీ అర్వింద్ ధర్మపురి పేర్కొన్నారు. గురువారం అర్సపల్లి బైపాస్ వద్ద రూ. 137.5 కోట్లతో నిర్మించనున్న ఆర్వోబీ పనులకు అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణతో కలిసి భూమిపూజ చేశారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ అర్సపల్లి వద్ద నిర్మించే ఆర్వోబీకి వందశాతం రైల్వే నిధులేనని తెలిపారు. 1.1 కిలోమీటర్ల బ్రిడ్జిని నాలుగు లైన్లలో నిర్మిస్తున్నామని, పనులు నాణ్యతతో ఏడాదిన్నరలో పూర్తి చేసేలా కాంట్రాక్టర్‌కు సూచించాలని అధికారులను ఆదేశించారు. రెండు నెలల్లో మామిడిపల్లి వద్ద ఆర్వోబీని, ఈఏడాది చివరలో మాధవనగర్ ఆర్వోబీని ప్రారంభిస్తామని తెలిపారు. అడవి మామిడిపల్లి వద్ద నిర్మించే ఆర్వోబీ నిధులను బీఆర్ఎస్ ప్రభుత్వం దారి మళ్లించిందని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ స్రవంతిరెడ్డి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ న్యాలం రాజు, కార్పొరేటర్ ముచ్కూర్ లావణ్య నవీన్, నాయకులు పంచరెడ్డి ప్రవళిక, సుక్క మధు, వెల్డింగ్ నారాయణ, మాస్టర్ శంకర్, ఇప్పకాయల కిషోర్, ప్రదీప్‌రెడ్డి, రోషన్, పంచరెడ్డి లింగం, వీడీసీ నాయకులు అబ్బయ్య, సిర్ప లింగం పాల్గొన్నారు.

# ఓటు విలువను గుర్తించాలి

- ఓటింగ్‌లో పాల్గొని భవితను నిర్దేశించుకోవాలి
- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు
- కలెక్టరేట్‌లో జాతీయ ఓటరు దినోత్సవం




ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, సీపీ కల్మేశ్వర్, అదనపు కలెక్టర్లు

**సుభాష్‌నగర్:** ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు ప్రాధాన్యతను ప్రతిఒక్కరూ గుర్తించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. 18 ఏళ్లు నిండిన వారందరూ ఓటరుగా నమోదు చేసుకోవడంతో పాటు విధిగా ఓటు వేయాలని పిలుపునిచ్చారు. గురువారం కలెక్టరేట్‌లో జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ యాదిరెడ్డి ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కు ప్రజాస్వామ్య పరిరక్షణకు పునాది అని పేర్కొన్నారు. ఎలాంటి అనుమానాలకు తావు లేకుండా ఎన్నికల సంఘం పకడ్బందీగా ఎన్నికలు నిర్వహిస్తోందన్నారు. ప్రజల్లో చైతన్యాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తోందని తెలిపారు. ఇందులో భాగంగానే గత ఎన్నికల్లో ఓట్ ఫ్రమ్ హోం విధానాన్ని అందుబాటులోకి తెచ్చిందని గుర్తుచేశారు. ప్రతి మూడు నెలకొకసారి ఓటరు జాబితాలో పేరు నమోదు కోసం ఎలక్షన్ కమిషన్ వెసులుబాటు కల్పించిందని సూచించారు. సీపీ కల్మేశ్వర్ మాట్లాడుతూ 18 ఏళ్లు దాటిన పౌరులందరికీ రాజ్యాంగం ఓటు హక్కు కల్పించిందన్నారు. ఓటుహక్కు ప్రాముఖ్యత, ఔన్నత్యంపై యువత ప్రతిఒక్కరికి అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎన్నికల్లో క్రమం తప్పకుండా ఓటుహక్కు వినియోగించుకుంటున్న సీనియర్ సిటిజన్లు, కొత్తగా నమోదైన యువ ఓటర్లను సన్మానించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా, మున్సిపల్ కమిషనర్ మకరందు, ఆర్డీవో రాజేంద్రకుమార్, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

# దగ్గరవుతున్న 'దూరవిద్య'

- డాక్టర్ అంబేద్కర్ ఓపెన్ వర్సిటీకి ఆదరణ
- ప్రతి ఏడాది పెరుగుతున్న అడ్మిషన్లు



డాక్టర్ బీఆర్ అంబేద్కర్ దూరవిద్య కేంద్రం

**నిజామాబాద్‌అర్బన్:** చదువుకోవాలనే ఆసక్తి ఉన్నా పరిస్థితుల కారణంగా చదువుకు దూరమైన వారికి.. ఉపాధి కోసం వివిధ పనులు చేసుకుంటూ చదువుకోవాలనే ఆసక్తి ఉన్న వారికి.. ఉద్యోగాల్లో ప్రమోషన్ల కోసం.. ఉన్నత విద్యను దగ్గర చేస్తోంది డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ. దూర విద్యనభ్యసిస్తున్న వారి సంఖ్య ప్రతి ఏడాది పెరుగుతోంది. ఓపెన్ యూనివర్సిటీలో విద్యనభ్యసించిన వారికి అన్ని పోటీ పరీక్షలు, ఉద్యోగ అవకాశాలకు అర్హత ఉండడం వరంగా మారింది. వారంలో ఒకరోజు మాత్రమే క్లాసులకు హాజరుకావాల్సి ఉండడంతో గృహిణులు, వ్యాపారులు, ప్రైవేట్ ఉద్యోగులు, కార్మికులు సైతం విద్యనభ్యసిస్తున్నారు. 'ఓపెన్' పట్టాతో ఇప్పటికే పలువురు ఉద్యోగులు ప్రమోషన్లు పొందగా, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన వారు సైతం ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలు సాధించారు.

**1982లో ప్రారంభం**

జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ డిగ్రీ కళాశాలలో 1982 ఆగస్టు 26న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రారంభమైంది. ఉమ్మడి జిల్లాలో 9 అధ్యయన కేంద్రాలుండగా, డిగ్రీ, పీజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. డిగ్రీలో బీఏ, బీకాం, బీఎస్సీ, పీజీలో ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ, ఎంబీఏ, పీజీ డిప్లొమా కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

**'ఓపెన్' చదువుతో ఉన్నత ఉద్యోగాల్లో..**

అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో చదివి ఎంతో మంది ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. సుమారు 10 మంది వరకు ప్రస్తుతం తహసీల్దార్లుగా పనిచేస్తున్నారు. కొందరు ప్రభుత్వ టీచర్లుగా నియమితులుకాగా, 20 మంది వరకు కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. దివ్య అనే విద్యార్థిని బెంగుళూరులో నీట్ కంప్యూటర్ ఫ్యాకల్టీగా పనిచేస్తోంది. తహసీల్దార్లుగా రాజేశ్వర్, భూపతి, ప్రశాంత్ పనిచేస్తుండగా, అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పద్మరాణి, ప్రభుత్వ టీచర్లుగా సౌమ్య, అంబిక, విజయలక్ష్మి ప్రభుత్వ టీచర్లుగా కొనసాగుతున్నారు.

**అడ్మిషన్లు**

2023–24 విద్యా సంవత్సరంలో యూజీ కోర్సుల్లో 1250 మంది, పీజీ కోర్సుల్లో 2వేల మంది విద్యనభ్యసిస్తున్నారు. 2021–22లో యూజీలో 1400, పీజీలో 1100 మంది, 2022–23లో యూజీలో 1100, పీజీలో 1300 మంది విద్యనభ్యసించారు. ప్రారంభంలో ఓపెన్ విద్యకు 200 నుంచి 300లోపే అడ్మిషన్లు వచ్చేవి.

**సువర్ణావకాశం**



అంబేద్కర్ దూర విద్య సువర్ణావకాశం. ఉద్యోగం చేస్తూ లేదా ఇతర పనులు చేస్తూ చదువుకునేందుకు ఎంతో తోడ్పడుతుంది. ఇక్కడ మంచి సౌకర్యాలు ఉన్నాయి. ఈ కారణంగానే నేను ఇక్కడ పీజీ చేయగలిగాను.

– రాజేశ్వర్, తహసీల్దార్, ఆదిలాబాద్

**చదవాలనే ఆసక్తి ఉంటే..**



చదవాలనే ఆసక్తి ఉన్నవారికి దూర విద్య ఎంతో ఉపయోగకరం. ఉన్నత విద్యను కొనసాగించవచ్చు. నేను ఇక్కడే పీజీ విద్యను పూర్తి చేశాను. ఉద్యోగం చేస్తూనే చదివేందుకు మంచి అవకాశం లభించింది.

– ప్రశాంత్, కలెక్టరేట్ ఏవో, నిజామాబాద్

**మంచి విద్యను అందిస్తున్నాం**



దూరవిద్య కేంద్రంలో డిగ్రీ, పీజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఈనెల 31 వరకు అడ్మిషన్లకు అవకాశం ఉంది. ప్రతిఏడాది ఇందులో చదివే వారి సంఖ్య పెరుగుతోంది. ఆసక్తి ఉన్నవారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

–రంజిత, దూర విద్యకేంద్రం కో–ఆర్డినేటర్

# సూత్రధారిని తప్పించి.. సబ్ ఏజెంట్లపై కేసులు

- గతేడాది ఆగస్టులో ఒకరి రిమాండ్
- 'సాక్షి' కథనంపై స్పందించి వివరాలు సేకరించిన పోలీసులు

**ఖలీల్‌వాడి:** గల్ఫ్ వీసాల పేరిట మోసగించిన కేసులో గతంలో పోలీసులు ప్రధాన సూత్రధారిని పక్కనబెట్టి సబ్‌ఏజెంట్లపై కేసులు నమోదు చేశారు. బాధితుల్లో ఒకరైన ఆర్మూర్ మండలం ఫతేపూర్‌కు చెందిన నవీన్ గతేడాది ఆగస్టులో ఆర్మూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో ఎస్‌హెచ్‌వో సురేష్‌బాబు నలుగురిపై కేసు నమోదు చేశారు. ఇందులో ఏ2గా ఉన్న డొంకేశ్వర్ మండలం అన్నారంనకు చెందిన భోజారాంను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. భోజారాంను పోలీసులు విచారించగా ప్రధాన సూత్రధారి పబ్బ భూమేశ్‌తో పాటు డబ్బులు చెల్లించిన వారి పేర్లను పోలీసులకు తెలిపారు. కానీ మిగతా వారిని మాత్రం పోలీసులు విచారించలేదు. దీంతో బాధితులు మూడు రోజుల క్రితం పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్‌ను ఆశ్రయించారు. ఈ కేసును సీపీ టాస్క్‌ఫోర్స్ పోలీసులకు అప్పగించారు.

**సబ్ ఏజెంట్‌కు పోలీసుల ఫోన్**

'సాక్షి' దినపత్రికలో గురువారం 'గల్ఫ్‌లో క్రెడిట్ స్కాం' శీర్షికన కథనం ప్రచురితమవడంతో ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సురేష్‌బాబు సబ్ ఏజెంట్ భోజారంనకు ఫోన్ చేసి వివరాలు అడిగినట్లు సమాచారం. పబ్బ భూమేశ్‌కు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నట్లు సబ్ ఏజెంట్ భోజారాం తెలిపారు. పబ్బ భూమేశ్ పాస్‌పోర్టు వివరాలు, ఇంటి వివరాలను అడిగినట్లు చెప్పారు.

**ఎల్‌వోసీ కేసు నమోదు చేస్తాం**

పబ్బ భూమేశ్‌పై ఎల్‌వోసీ(లుకౌట్) కేసు నమోదు చేస్తాం. బాధితుల ఫిర్యాదు మేరకు భోజారాంపై కేసు నమోదు చేశాం. అతడిని విచారిస్తే పలువురి పేర్లు చెప్పాడు. భోజారాం చెప్పిన వారిలో సుబ్బారెడ్డి అనే వ్యక్తిని విచారించాం. మళ్లీ విచారిస్తాం. ఎన్నికలు ఉండడంతో కేసును విచారించాలేకపోయాం. కేసు ఫైల్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీసులకు అప్పగిస్తాం.

– సురేష్‌బాబు, ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో





'రిపబ్లిక్ డే'కు సర్వం సిద్ధం

**సుభాష్‌నగర్:** జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించనున్న గణతంత్ర వేడుకలకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తిచేసింది. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు శుక్రవారం ఉదయం 9 గంటలకు త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. వేడుకలకు ప్రజాప్రతినిధులు, పుర ప్రముఖులు హాజరుకానున్న నేపథ్యంలో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఇదివరకే అధికారులకు సూచించారు. వేదిక, ఎగ్జిబిషన్ స్టాల్స్, శకటాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు తదితర ఏర్పాట్లపై పోలీస్, రెవెన్యూ తదితర శాఖల అధికారులతో కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించి కీలక సూచనలు చేశారు. ఈ మేరకు సంబంధిత అధికారులు పోలీస్ పరేడ్ మైదానంలో విస్తృత ఏర్పాట్లు చేశారు.

## ముమ్మరంగా చెరుకు క్రషింగ్‌

సదాశివనగర్‌: మండలంలోని అడ్లూర్‌ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్‌ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్‌ ముమ్మరంగా కొనసాగుతోంది. బుధవారం నాటికి 2లక్షల 19వేల 287 టన్నుల క్రషింగ్‌ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్‌ ప్రెసిడెంట్‌ వేణుగోపాల్‌ రావు గురువారం తెలిపారు. పర్మిట్ల ఆధారంగా చెరుకును గానుగకు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. కూలీలకు అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తూ క్రషింగ్‌ పనులు చేపడుతున్నట్లు తెలిపారు.



# జోరుగా జూదం..

- బాల్కొండ నియోజకవర్గంలో కొనసాగుతున్న పేకాట, గంజాయి దందాలు
- రాజకీయ నాయకుల ఇళ్లు, ఫాంహౌస్‌లే స్థావరాలు
- ప్రేక్షకపాత్రలో పోలీసులు



మోర్తాడ్‌: బాల్కొండ నియోజకవర్గంలో జోరుగా జూదం, గంజాయి దందా కొనసాగుతోంది. కొన్నేళ్లుగా సాగుతున్న ఈ దందాల వెనుక రాజకీయ నాయకుల హస్తం ఉండటంతో పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల కొన్నిచోట్ల పేకాట స్థావరాలపై పోలీసులు దాడి చేసి పేకాట ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. అందులో పేకాట స్థావరాలు నిర్వహిస్తున్నది కొందరు బీఆర్‌ఎస్‌ నాయకులే అని పోలీసుల దాడుల్లో వెల్లడైంది.

**నాయకుల ఇళ్లల్లోనే..**

భీమ్‌గల్‌ మండలంలోని ముచ్కూర్‌, బడాభీమ్‌గల్‌ లలోని నాయకుల ఫాంహౌస్‌లలో పేకాట జోరుగా కొనసాగుతోంది. అలాగే భీమ్‌గల్‌, బాల్కొండ, మెండోరా, ముప్కాల్‌లోనూ పేకాట కోసం నాయకులు తమ ఇళ్లనే స్థావరాలుగా మార్చారని ఆరోపణలు ఉన్నాయి. రాజకీయ నాయకులే పేకాట స్థావరాలను నిర్వహిస్తుండటంతో పోలీసులు అడ్డు చెప్పలేకపోతున్నారని తెలుస్తోంది.

**గంజాయి విక్రేతలకు సైతం..**

నియోజకవర్గంలో గంజాయి విక్రయిస్తున్న వారికి సైతం రాజకీయ నాయకుల అండగా ఉంటున్నారు. దీంతో వారి వ్యాపారం జోరుగా కొనసాగుతోంది. నాయకుల కనుసన్నల్లోనే జూదం, గంజాయి దందాలు కొనసాగుతుండడంతో పోలీసులు, ఎక్సైజ్‌ అధికారులు చర్యలు తీసుకోలేకపోతున్నట్లు సమాచారం. భీమ్‌గల్‌ మండలంలోని మెండోరాకు చెందిన ఓ నాయకుడు గంజాయి విక్రేయేతల వెనుక ఉండి పోలీసులు వారికి అడ్డురాకుండా వ్యవహరిస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. అడపదడపా గంజాయి కేసులు నమోదైనా జగిత్యాల్‌, నిర్మల్‌, ఆర్మూర్‌ ప్రాంతాలకు చెందిన వారినే పోలీసులు అరెస్టు చేశారే తప్ప స్థానిక గంజాయి విక్రయాల వెనుక కీలక పాత్ర పోషించే వారిని ఇప్పటి వరకు అరెస్టు చేయలేదనేది బహిరంగ రహస్యం. బీఆర్‌ఎస్‌ హయాంలోనే గంజాయి, జూదం జోరుగా సాగడం మొదలు కాగా కాంగ్రెస్‌ అధికారంలోకి వచ్చాక అదే తంతు కొనసాగుతోంది. ఇకనైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి జూదం, గంజాయి దందాలపై ఉక్కుపాదం మోపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**2023 జనవరి నుంచి ఇప్పటి వరకు నమోదైన కేసులు..**

| పీఎస్‌ | గంజాయి | జూదం |
|---|---|---|
| మోర్తాడ్‌ | 2 | 4 |
| కమ్మర్‌పల్లి | 2 | 4 |
| వేల్పూర్‌ | 1 | 5 |
| ముప్కాల్‌ | 1 | 3 |
| బాల్కొండ | 5 | 4 |
| మెండోరా | 1 | 8 |
| ఏర్గట్ల | 2 | 3 |
| భీమ్‌గల్‌ | 2 | 3 |
| మొత్తం | 16 | 34 |

### రెండు అంశాలపై పోరాటం చేస్తున్నా..



నియోజకవర్గంలో యథేచ్ఛగా సాగుతున్న గంజాయి, పేకాట నిర్మూలనపై కొన్నేళ్ల నుంచి పోరాటం చేస్తున్నా. పోలీసులు సరిగా స్పందించక పోవడంతోనే ప్రజలు ఆర్థికంగా నష్టపోతున్నారు. ప్రభుత్వం దృష్టికి ఈ అంశాలు తీసుకెళ్లి కఠిన చర్యలు తీసుకునేలా చేస్తాం.

– ముత్యాల సునీల్‌రెడ్డి, కాంగ్రెస్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి

### గంజాయి నియంత్రణలో ముందున్నాం

జూదం, గంజాయి లాంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలను ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదు. ఇప్పటికే గంజాయి నియంత్రణలో ముందున్నాం. అలాగే ప్రజలు సహకరించి పేకాట స్థావరాల సమాచారం ఇస్తే ప్రజలకు మేలు చేసిన వారవుతారు.

– అనిల్‌రెడ్డి, ఎస్సై, మోర్తాడ్‌

### పక్కా నిఘా ఉంచాం..

గంజాయి రవాణాను అడ్డుకునేందుకు పక్కా నిఘా ఉంచాం. ప్రజలు కూడా సహకరించి గంజాయి విక్రేతల సమాచారం అందిస్తే పూర్తిస్థాయిలో అరికడుతాం. గంజాయి రవాణా వెనుక ఎంత పెద్దవారున్నా సహించేది లేదు.

–గుండప్ప, ఎక్సైజ్‌ శాఖ అధికారి మోర్తాడ్‌

## ఆగ్రోస్‌ దుకాణాల తనిఖీ

డొంకేశ్వర్‌(ఆర్మూర్‌): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఆగ్రోస్‌ ఫర్టిలైజర్స్‌, సీడ్స్‌ను విక్రయించే ఆగ్రోస్‌ దుకాణాల తనిఖీ జరుగుతోంది. తహసీల్దార్లు, మండల వ్యవసాయాధికారులు కలిసి ఈ కేంద్రాల్లో రెండు రోజులుగా తనిఖీ చేస్తున్నారు. దుకాణాల లైసెన్సులు, ఫర్టిలైజర్స్‌ విక్రయాలపై వివరాలను పరిశీలిస్తున్నారు.

## ఇంటర్‌ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

కామారెడ్డి క్రైం: ఇంటర్‌ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్‌ జితేష్‌ వి పాటిల్‌ సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫిబ్రవరి 1 నుండి 15 వరకు రెండు సెషన్స్‌లో ప్రాక్టికల్‌ పరీక్షలు జరుగుతాయన్నారు. 16న ఇంగ్లిష్‌ ప్రాక్టికల్‌ పరీక్ష, 19న ఎన్విరాన్మెంట్‌ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. వార్షిక పరీక్షలు ఫిబ్రవరి 28 నుండి మార్చ్‌ 14 వరకు ఉంటాయని పేర్కొన్నారు. కామారెడ్డి, బాన్సువాడ, బిచ్కుందలోని 50 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. ఎస్పీ సింధు శర్మ, ఆర్టీసీ డీఎం ఇందిర, ఇంటర్‌ నోడల్‌ అధికారి షేక్‌ సలాం పాల్గొన్నారు.

## సస్పెక్ట్‌ షీట్‌ నేరస్తులకు కౌన్సెలింగ్‌

కామారెడ్డి క్రైం: గొడవలు, కొట్లాటలు, దొంగతనాలు వదిలి సత్ప్రవర్తనతో మెలగాలని ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి సస్పెక్ట్‌ షీట్‌ ఉన్న పాత నేరస్తులకు సూచించారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో గురువారం వారికి కౌన్సెలింగ్‌ ఇచ్చారు. నేరాలకు దూరంగా ఉంటూ సత్ప్రవర్తనతో మెలుగుతున్నట్లు నిర్ధారణ అయితేనే సస్పెక్ట్‌ షీట్‌ను ఎత్తివేయడానికి ఉన్నతాధికారులకు నివేదిస్తామని స్పష్టం చేశారు. విరుద్ధంగా ప్రవర్తిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



## క్రైం కార్నర్‌

### వరద కాలువలో రైతు గల్లంతు



నీటిలో గల్లంతైన సాయన్న

బాల్కొండ: వరద కాలువలో ఓ రైతు గల్లంతైన ఘటన మండలంలోని బోదెపల్లిలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు, ఏఎస్సై శంకర్‌ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చెందిన గడ్డం చిన్నసాయన్న(60) అనే రైతు వరద కాలువలో పంపు సెట్‌ల మోటర్‌ వైర్లు, పంపు సెట్‌ ఫుట్‌బాల్‌లో ఏదైన సమస్య వస్తే నీటిలో మునిగి మరమ్మతు పనులు చేస్తుంటాడు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన ఇద్దరి రైతుల పంపు సెట్ల వైర్లలో సమస్య ఉండటంతో పంపు సెట్‌ వద్ద నీట మునిగి ఓ పంపు సెట్‌కు విద్యుత్తు వైర్‌ తీసుకొచ్చాడు. మరో పంపుసెట్‌ వద్ద విద్యుత్తు తీగ కోసం నీట మునిగి తిరిగి రాలేదు. దీంతో విషయం తెలుసుకున్న కుటుంబీకులు పోలీసులకు సమాచారం అందించారు. గజఈత గాళ్ల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రికి వరకు ఆచూకీ లభించలేదు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

### స్వగ్రామానికి చేరిన మృతదేహం



రాజేశ్వర్‌(ఫైల్‌)

మాక్లూర్‌: బతుకుదెరువు కోసం దుబాయి వెళ్లిన ఓ వ్యక్తి మృతదేహం గురువారం స్వగ్రామానికి చేరుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం .. మండలంలోని చిక్లి గ్రామానికి చెందిన గైని రాజేశ్వర్‌ (52) బతుకుదెరువు నిమిత్తం దుబాయి వెళ్లాడు. అక్కడ చేస్తున్న పనికి సరైన వేతనం రావడం లేదంటూ మనస్తాపానికి గురై ఈ నెల 6న ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రజాప్రతినిధుల చొరవతో రాజేశ్వర్‌ మృతదేహం స్వగ్రామానికి చేరుకుంది. అనంతరం నిర్వహించిన అంత్యక్రియల్లో గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


### డివైడర్‌ను ఢీకొని ఒకరికి గాయాలు

ఖలీల్‌వాడి: నగరంలోని బోధన్‌ రోడ్డులో ఉన్న ఓ డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో యువకుడికి తీవ్రగాయాలయ్యాయి.సికింద్రాబాద్‌కు చెందిన ఓ యువకుడు బైక్‌పై బోధన్‌ రోడ్డుగుండా వెళ్తుండగా ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీకొన్నాడు. ఈ ఘటనలో అతడికి తీవ్రగాయాలు కావడంతో అక్కడే విధుల్లో ఉన్న ట్రాఫిక్‌ కానిస్టేబుల్‌ సంజీవ్‌కుమార్‌ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు.

### బైక్‌ చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్‌

మోపాల్‌: బైకులను చోరీ చేసిన ఘటనలో ఇద్దరి నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై గంగాధర్‌ తెలిపారు. మండల కేంద్రంలోని పీఎస్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్సై మాట్లాడారు. మోపాల్‌లో వాహనాల తనిఖీ చేస్తున్న సమయంలో నగరంలోని అర్సపల్లికి చెందిన షేక్‌ సమేర్‌, మహ్మద్‌ అమేర్‌ఖాన్‌లు రెండు నంబర్‌ప్లేట్‌ లేని బైక్‌లపై మోపాల్‌లో సంచరిస్తుండగా వారిని పట్టుకొని విచారించగా బైక్‌లను దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారు. దీంతో వీరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు. ఎస్సై వెంట ఏఎస్సై దయాళ్‌ సింగ్‌, కానిస్టేబుళ్లు ఉన్నారు.

### ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



వేల్పూర్‌: ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను మండలంలోని పడగల్‌లో గురువారం పట్టుకున్నట్లు ఎస్సై వినయ్‌ కుమార్‌ తెలిపారు. సుంకెట వాగు నుంచి బాల్కొండ వైపు ఇసుక తరలిస్తున్నారన్న సమాచారం మేరకు ట్రాక్టర్లను తనిఖీ చేయగా ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకొని పీఎస్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైనా ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

### పాన్‌షాపులో గంజాయి విక్రయం



నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

ఖలీల్‌వాడి: నగరంలోని గుర్బాబాది రోడ్‌లో కమల్‌సింగ్‌కు చెందిన పాన్‌షాపులో దాడి నిర్వహించి 550 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్‌ టాస్క్‌ఫోర్స్‌ సీఐ విలాస్‌ గురువారం తెలిపారు. గంజాయిని సీజ్‌ చేసి కమల్‌సింగ్‌కు అరెస్టు చేసినట్లు చెప్పారు. దాడిలో ఎక్సైజ్‌ ఎస్సై గంగాధర్‌, సిబ్బంది సలీం, సాగర్‌ రావు, గోపి, కార్తిక్‌, కిరణ్‌ కుమార్‌, నీలిరాజు పాల్గొన్నారు.

## ఇగ్నైట్‌ ఇండియా టీయూ కో–ఆర్డినేటర్‌గా రవీందర్‌రెడ్డి



రవీందర్‌రెడ్డి

తెయూ(డిచ్‌పల్లి): ఇగ్నైట్‌ ఇండియా టీయూ కో–ఆర్డినేటర్‌గా ఆచార్య రవీందర్‌రెడ్డిని యూజీసీ సెక్రటరీ దీపాలి జైస్వాల్‌ నియమించినట్లు గురువారం నియామక ఉత్తర్వులు అందాయి. యూనివర్సిటీ గ్రాంట్స్‌ కమిషన్‌ ఆధ్వర్యంలో ఇగ్నైటింగ్‌ ఇండియా–2047 విజన్‌ ఆఫ్‌ ది డెవలప్‌మెంట్‌ పేరుతో ఫిబ్రవరిలో విశ్వవిద్యాలయాలు, కళాశాలలు నిర్వహించే యువ మంథాన్‌ ఎక్స్‌పర్మెంటల్‌ లెర్నింగ్‌ కార్యక్రమానికి నియామకం కావడంపై రవీందర్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. యూజీ, పీజీ విద్యార్థులకు యువ మంథన్‌ మోడల్‌ యునైటెడ్‌ నేషన్‌ పేరుతో నూతన ఆవిష్కరణలు, గ్లోబల్‌ డిప్లమసి, స్కిల్‌ డెవలప్‌మెంట్‌, భారత ప్రజాస్వామ్య భవిష్యత్తు అనే అంశాలపై వివిధ కార్యక్రమాలు నిర్వహించాలని ఉత్తర్వులో పేర్కొన్నారని రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. అనంతరం రవీందర్‌రెడ్డికి రిజిస్ట్రార్‌ యాదగిరి, సీనియర్‌ అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

## జాతీయస్థాయి బేస్‌బాల్‌ పోటీలకు ఎంపిక



అభినందిస్తున్న ఉపాధ్యాయులు

డిచ్‌పల్లి: మండలంలోని ధర్మారం(బి)లో ఉన్న సాంఘిక సంక్షేమ పాఠశాల/కళాశాలకు చెందిన విద్యార్థిని మహిత జాతీయ బేస్‌బాల్‌ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్‌ బి.సంగీత గురువారం తెలిపారు. ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి బేస్‌బాల్‌ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయస్థాయికి ఎంపికైందన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో ఈనెల 28 నుంచి ఫిబ్రవరి 1 వరకు నిర్వహించే 67వ జాతీయస్థాయి స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌ అండర్‌–14 బేస్‌బాల్‌ పోటీల్లో మహిత పాల్గొంటుందన్నారు. అనంతరం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థిని మహితను ప్రిన్సిపాల్‌ సంగీతతో పాటు ఫిజికల్‌ డైరెక్టర్‌ నీరాజరెడ్డి, పీఈటీలు జ్యోత్స్న, దమయంతి, హౌస్‌ టీచర్స్‌ అభినందించారు.

## వర్ని ఏఎంసీ కార్యదర్శి సస్పెన్షన్‌

సాక్షి ఎఫెక్ట్‌..



శ్రీనివాస్‌, ఏఎంసీ కార్యదర్శి

వర్ని: వర్ని వ్యవసాయ మార్కెట్‌ కమిటీ కార్యదర్శి శ్రీనివాస్‌ను సస్పెండ్‌ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా మార్కెటింగ్‌ అధికారిణి గంగు గురువారం తెలిపారు. ఈనెల 19న ‘అవినీతి వర్ని ఏఎంసీ’ అనే శీర్షికన ‘సాక్షి’ దినపత్రికలో ప్రచురితమైన కథనానికి స్పందించిన రాష్ట్ర డైరెక్టర్‌ ఆఫ్‌ మార్కెటింగ్‌ డీఎం లక్ష్మీబాయి కార్యదర్శిని సస్పెండ్‌ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్టు జిల్లా అధికారిణి గంగు వెల్లడించారు. విధుల్లో నిర్లక్ష్యం, అధికారుల అనుమతి లేకుండా గోడౌన్లలో రైతుల బియ్యాన్ని నిల్వ ఉంచడం, ఏఎంసీకి చెందిన క్లీనర్‌ యంత్రాలను నిర్లక్ష్యంగా పడివేయడం, 30 క్లీనర్ల మోటార్లు గల్లంతు కావడంపై విచారణ చేపట్టగా అవి నిజమని తేలడంతో కార్యదర్శిని సస్పెన్షన్‌ చేసినట్లు పేర్కొన్నారు.

## పీజీ పరీక్షలు ప్రశాంతం

తెయూ(డిచ్‌పల్లి): తెయూ పరిధిలో కొనసాగుతున్న పీజీ సెమిస్టర్‌ పరీక్షలు గురువారం రెండోరోజు ప్రశాంతంగా జరిగినట్లు కంట్రోలర్‌ అరుణ తెలిపారు. ఉదయం నిర్వహించిన పరీక్షలకు 1709 మందికి గాను 1613 మంది హాజరు కాగా 96 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాలను తెయూ ఆడిట్‌ సెల్‌ డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ గంట చంద్రశేఖర్‌ సందర్శించి పరీక్షల తీరును పరిశీలించారు.

## రాష్ట్ర పోటీల్లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ




క్రీడాకారులను అభినందిస్తున్న నిర్వాహకులు

నిజామాబాద్‌నాగారం: హైదరాబాద్‌లో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి తెక్వాండో చాంపియన్‌షిప్‌లో నిజామాబాద్‌ తైక్వాండో సబ్‌ జూనియర్‌ క్రీడాకారులు సత్తా చాటారు. గోపికృష్ణ గోల్డ్‌ మెడల్‌ సాధించి జాతీయ స్థాయి తైక్వాండోకు ఎంపిక కాగా, సహస్ర రాథోడ్‌ సిల్వర్‌ మెడల్‌, భవ్య, చంద్ర ఆదిత్య, మోక్షిత్‌ బ్రాంజ్‌ మెడల్స్‌ సాధించారని జేసీఐ ప్రెసిడెంట్‌, నిజామాబాద్‌ తైక్వాండో కార్యదర్శి కె. మనోజ్‌ కుమార్‌ తెలిపారు. అనంతరం గెలుపొందిన క్రీడాకారులను తెలంగాణ తైక్వాండో అసోసియేషన్‌ కార్యదర్శి, గ్రాండ్‌ మాస్టర్‌ ప్రవీణ్‌ కుమార్‌, పలువురు అభినందించారు.

## గిఫ్ట్‌ పేరిట బంగారం అపహరణ

ఖలీల్‌వాడి: నగరంలోని సీఎస్‌ఐ చర్చి ఎదుట పేదలకు గిఫ్టులు అందిస్తున్నారని ఓ మహిళను నమ్మించి బంగారం, వెండి అపహరించినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్‌ గురువారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. సీఎస్‌ఐ ప్రాంతానికి చెందిన చంద్రవ్వ పలు ఇళ్లల్లో పని చేస్తుందని, సాయంత్రం ఇంటికి వెళ్తుండగా ఇద్దరు చర్చి ఎదుట గిఫ్టులు ఇస్తున్నారని చెప్పి ఆమెను సమీప ప్రాంతంలోకి తీసుకెళ్లి బంగారం, వెండిని అపహరించారు. దీంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

# విత్తన ఎంపికే ప్రధానం

- జిల్లాలో సుమారు 33 వేల ఎకరాల్లో పసుపు సాగు


పసుపు పంట

బాల్కొండ: పసుపు తవ్వకాలు జోరందుకున్న నేపథ్యంలో విత్తన ఎంపికలో రైతులకు బాల్కొండ ఉద్యానవనశాఖ అధికారి రోహిత్ పలు సూచనలు చేస్తున్నారు. ప్రస్తుతం తవ్వుతున్న పసుపులో నుంచే విత్తనం నిల్వ చేసే రైతులు.. దుంపకుళ్లు సోకిన పంట నుంచి విత్తనాన్ని తీసుకోవద్దని హెచ్చరిస్తున్నారు. విత్తన ఎంపికలో రైతులకు పలు సూచనలు చేస్తున్నారు.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

విత్తనంగా తీసుకున్న పసుపు కొమ్మును లీటర్ నీటికి మైటాలాక్సిల్ లేదా సైమక్సానిల్ 2.5 గ్రాములు, 2 మిల్లీలీటర్లు మలథియాన్ లేదా 1.6 మోనోక్రోటపాస్‌ను కలిపిన ద్రావణాన్ని పట్టించాలి. అరగంటపాటు విత్తన పసుపును ఆరబెట్టాలి. అనంతరం పసుపు కొమ్మును కుప్పగా వేసుకోవాలి. దీంతో దుంపకుళ్లు తెగుళ్లు కలిగించే శిలీంద్రాలు, దుంప నుంచి రసం పీల్చే పొలుస పురుగులు చనిపోతాయి. దీంతో విత్తనానికి తెగుళ్లు లేకుండా పోతాయి. పసుపు విత్తే ముందు ఎకరానికి మూడు క్వింటాళ్ల వేప పిండి తప్పనిసరిగా వేయాలి. దీంతో అధిక పంట దిగుబడి సాధించొచ్చు.

**పసుపుఆకును కప్పొద్దు..**

విత్తన పసుపు నిల్వ చేసిన కుప్పపై పసుపు ఆకును కప్పకూడదు. పండించిన పసుపు పంట ఆకులపై ఇది వరకే మర్రాకు తెగుళ్లు సోకి ఉంటుంది. దీంతో మర్రాకు సోకిన శిలీంద్రాలు ఆకులపై ఉంటాయి. ఆకును విత్తన కుప్పపై కప్పడం వల్ల శిలీంద్రాలు విత్తన కొమ్ముకు సోకే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో పసుపు ఆకుకు బదులుగా వేపాకు లేదా మోదుగాకు, టేకు ఆకులను కప్పాలి. విత్తన ఎంపిక సరిగా ఉంటే పంట దిగుబడి అధికంగా ఉంటుంది.

జిల్లాలో సుమారు 33వేల ఎకరాల విస్తీర్ణంలో పసుపు సాగు చేస్తున్నారు. కానీ విత్తన ఎంపిక సరిగాలేక పోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పసుపు విత్తనం మార్కెట్‌లో లభించకపోవడంతో రైతులు తాము పండించిన పంటలో నుంచే విత్తనం నిల్వ చేసుకోవాలి. కానీ.. తరాలుగా పసుపు సాగు చేస్తున్న రైతులు విత్తన పసుపును నిల్వ చేసుకోవడం, ఎంపిక చేసుకోవడంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవడం లేదు. పసుపు పంటకు ప్రధాన తెగుళ్లు దుంపకుళ్లు. ఈ తెగుళ్ల వలన పసుపు రైతు తీవ్రంగా నష్టపోతాడు. తెగుళ్లు వ్యాపించకుండా ఉండాలంటే విత్తన ఎంపికనే ప్రధానం. విత్తన పసుపును దుంపకుళ్లు సోకిన పంట భూమిలో నుంచి వేయడం వల్ల విత్తిన పసుపునకు తప్పకుండా దుంపకుళ్లు సోకుతుంది.




## మంచుకురిసే..

దట్టంగా కమ్ముకున్న పొగమంచు మనసును మురిపించింది. గురువారం ఉదయం ఎనిమిది గంటలైనా భానుడి కిరణాలను పొగమంచు కప్పి ఉంచింది. వాహనదారులు లైట్లు వేసుకొని ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. సిరికొండ మండల కేంద్రంలోని దృశ్యాలివి. – సిరికొండ

# వలస కార్మికుల సమస్యలపై అధ్యయనం

- యూఏఈలో పర్యటించనున్న వలస కార్మిక సంఘాల ప్రతినిధులు, కాంగ్రెస్ ఎన్‌ఆర్‌ఐ సెల్ నాయకులు
- గల్ఫ్ సంక్షేమ బోర్డు ఏర్పాటుకు కాంగ్రెస్ ప్రభుత్వం సుముఖత నేపథ్యంలో..



మోర్తాడ్(బాల్కొండ): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవాసీ విధానం(ఎన్‌ఆర్‌ఐ పాలసీ) లేదా గల్ఫ్ సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయడానికి సుముఖత వ్యక్తం చేసిన నేపథ్యంలో వలస కార్మికులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై అధ్యయనం చేయడానికి ఒక బృందం యూఏఈలో పర్యటించనుంది. యూఏఈలో సెలవు రోజులైన శని, ఆదివారాల్లో వలస కార్మికులను కలిసి వారి సమస్యలు తెలుసుకోడానికి కార్మిక సంఘాల నాయకులు, కాంగ్రెస్ ఎన్‌ఆర్‌ఐ సెల్ ప్రతినిధులు వెళ్తున్నారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి దుబాయ్‌కు చేరుకోనున్నారు. అక్కడ దుబాయ్, షార్జా, అబుదాబి, బార్ దుబాయ్‌లలోని వలస కార్మికుల క్యాంపులలో బస చేయనున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం వలస కార్మికుల సంక్షేమం కోసం అమలు చేయబోయే పథకాల కోసం ఈ స్టడీ టూర్ కీలకం కానుందని అధ్యయనం కోసం వెళుతున్న ప్రతినిధులు వెల్లడించారు. ప్రవాసీ మిత్ర లేబర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్వదేశ్ పరికిపండ్ల, జగిత్యాల జిల్లా సారంగాపూర్ జెడ్పీటీసీ సభ్యుడు, గల్ఫ్ రిటర్నీ పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, టీపీసీసీ ఎన్‌ఆర్‌ఐ విభాగం చైర్మన్ మాజీ రాయబారి బీఎం వినోద్‌కుమార్, గల్ఫ్ ఎన్‌ఆర్‌ఐ సెల్ కన్వీనర్ సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి, టీపీసీసీ కార్యదర్శి జెలాల సైదయ్య బాబులు ఇక్కడి నుంచి వెళుతున్నవారిలో ఉన్నారు. జెనీవా పర్యటనలో ఉన్న ఎమిగ్రంట్స్ వెల్ఫేర్ ఫోరం అధ్యక్షుడు మంద భీంరెడ్డి దుబాయ్‌కు చేరుకుని ఈ బృందంతో కలువనున్నారు. వలస కార్మికులతో పాటు సామాజిక, సాంస్కృతిక సంస్థల నాయకులతో కలిసి గల్ఫ్ కార్మికుల సమస్యలపై వివరాలను నమోదు చేయనున్నారు. గల్ఫ్ సంక్షేమ బోర్డు ఏర్పాటు అయ్యే తరుణంలో కార్మిక సంఘాల ప్రతినిధుల అధ్యయనం ప్రాధాన్యతన సంతరించుకుంది.

### కార్మికులను భాగస్వాములను చేయాలి



రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణలో ఏర్పాటు చేయబోయే గల్ఫ్ సంక్షేమ బోర్డు, ఎన్‌ఆర్‌ఐ పాలసీలో వలస కార్మికులను భాగస్వాములను చేయాలనే ఉద్దేశంతో అధ్యయనం కోసం వెళుతున్నాం. కార్మికులు గతంలో ఎదుర్కొన్న సమస్యలు ఏమిటి కొత్త కొత్తగా ఎలాంటి ఇబ్బందులు పడుతున్నారు. వారి ఆకాంక్షలకు అనుగుణంగా బోర్డు ఏర్పడితేనే ప్రయోజనం అని మా భావన.

– స్వదేశ్ పరికిపండ్ల, ప్రవాసీ మిత్ర లేబర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు

## బాబా ఆలయంలో ‘మధ్యాహ్న భోజనం’


సాయిబాబా ఆలయంలో భోజనం చేస్తున్న విద్యార్థులు

ఎడపల్లి(బోధన్): మెనూ ప్రకారం భోజనం అందకపోవడంతో విద్యార్థులు కడుపునిండా తినలేని పరిస్థితి ఉంది. ఎడపల్లి మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం సరిగా లేకపోగా, ప్రభుత్వ ఆదేశాల ప్రకారం వారానికి మూడు రోజులు కోడిగుడ్డు ఇవ్వాల్సి ఉండగా, ఒక్క రోజుకూడా ఇవ్వడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మధ్యాహ్న భోజనం సరిగా ఉండకపోవడంతో విద్యార్థులు గ్రామంలో జరిగే శుభకార్యాలకు వెళ్లి భోజనం చేస్తున్నారు. ప్రతి గురువారం సాయిబాబా ఆలయంలో నిర్వహించే అన్నదానంలో భోజనం చేస్తున్నారు. ఎప్పటిలాగే ఈ గురువారం కూడా ఆలయానికి వెళ్లి భోజనం చేశారు. ఈ విషయమై హెచ్‌ఎం సాయిలును వివరణ కోరగా.. మరోసారి విద్యార్థులు బయటికి వెళ్లకుండా చూస్తామని, మధ్యాహ్న భోజనంలో గుడ్డు అందించని మాట వాస్తవమేనని అన్నారు.



# అద్దె భవనాలే దిక్కు


ప్రైవేట్ భవనంలో కొనసాగుతున్న మైనారిటీ గురుకుల బాలుర పాఠశాల, కళాశాల

- రూ.లక్షల్లో అద్దె చెల్లింపు
- కనీస వసతులు కరువు


వెటర్నరీ ఆస్పత్రి భవనంలో కొనసాగుతున్న తహసీల్ కార్యాలయం

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ పట్టణంతోపాటు నూతనంగా ఏర్పడిన ఆలూర్ మండలంలో ప్రభుత్వ కార్యాలయాలు, గురుకులాలకు పక్కా భవనాలు లేకపోవడంతో అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. గత ప్రభుత్వం గురుకులాల ఏర్పాటుకు పెద్ద పీట వేసినప్పటికీ.. పక్కా భవనాలను నిర్మించ లేకపోయింది. దీంతో అద్దె భవనాల్లో మౌళిక వసతులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి హౌసింగ్ బోర్డులోని సాంఘిక సంక్షేమ బాలికల డిగ్రీ కళాశాలను సందర్శించగా, విద్యార్థినులు తమ సమస్యలను ఏకరవు పెట్టారు. ప్రైవేట్ భవనాల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మౌళిక వసతులు కల్పించలేని పరిస్థితి నెలకొంది. అలాగే నెలకు రూ.లక్షల్లో అద్దె చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. ఆయా సంక్షేమ శాఖల నుంచి బిల్లులు రావడం ఆలస్యమైతే భవనాల యజమానులు ప్రిన్సిపాళ్లపై ఒత్తిడి తీసుకురావడం తలనొప్పిగా మారింది. ఆర్మూర్ పట్టణంలో గతంలో నిర్మించిన స్త్రీ శక్తి భవనం ఆర్డీవో కార్యాలయానికి కేటాయించడంతో మహిళాసంఘాల సమావేశాలు నిర్వహించేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆర్డీవో కార్యాలయంతోపాటు ఎంపీఐ కార్యాలయం, హౌసింగ్ బోర్డులోని గురుకుల పాఠశాల, కళాశాలకు మామిడిపల్లి, కొటార్మూర్ గ్రామాల్లో స్థలాలను కేటాయించినప్పటికీ భవన నిర్మాణాలు చేపట్టలేదు. నిధులు మంజూరు చేయకపోవడంతో నిర్మాణాలు ప్రారంభం కాలేదు.

**నూతన మండలంలో సైతం..**

రెండు సంవత్సరాల క్రితం నూతనంగా ఏర్పాటైన ఆలూర్ మండలంలో ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణకు అస్తవ్యస్తంగా ఉంది. తహసీల్ కార్యాలయం వెటర్నరీ ఆస్పత్రి భవనంలో కొనసాగుతుండగా, మండల పరిషత్, పంచాయతీరాజ్ శాఖ కార్యాలయాలు ఇప్పటికీ ఏర్పాటు చేయలేదు. దీంతో ఆలూర్ మండల ప్రజలు పనిమీద ఆర్మూర్ వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో మండల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నూతన ప్రభుత్వమైనా ఆలూర్‌లో అన్నిశాఖల కార్యాలయాలను ఏర్పాటు చేసి సొంత భవనాలను నిర్మించాలని మండల ప్రజలు కోరుతున్నారు.


శిథిలావస్థలో కోట


కొనసాగుతున్న కోనేరు నిర్మాణ పనులు

## గోండు రాజుల కోటకు కొత్త కళ

గోండుల వైభవానికి చిహ్నంగా నిలిచిన ఉట్నూర్ డివిజన్ కేంద్రంలోని పురాతన గోండు రాజుల కోట పూర్వ వైభవాన్ని సంతరించుకుంటోంది. కేబీ కాంప్లెక్స్ సమీపంలోని ఈ కోట నిర్వహణ లోపంతో శిథిలావస్థకు చేరి కోనేరు, కోట ప్రధాన భాగాలు కూలిపోయాయి. దీన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని భావించిన అప్పటి ప్రభుత్వం రూ.2.30కోట్లు మంజూరు చేసింది. పనులు యుద్ధప్రాతిపదికన కొనసాగుతుండటంతో త్వరలోనే కోట కొత్త కళ సంతరించుకోనుంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్


కొనసాగుతున్న పునర్నిర్మాణ పనులు

# సంప్రదాయబద్ధంగా మహాపూజ

- జంగుబాయి క్షేత్రానికి తరలివచ్చిన భక్తులు
- ఎంపీ సోయం బాపూరావు ప్రత్యేక పూజలు


గుహ వద్ద ఎంపీ సోయం బాపూరావు, నాయకులు, తదితరులు

కెరమెరి(ఆసిఫాబాద్): కెరమెరి మండలంలోని మహారాజ్‌గూడ అడవుల్లో కొలువైన జంగుబాయి అమ్మవారి క్షేత్రంలో గురువారం మహాపూజ సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. మైసమ్మ, పోచమ్మ, రావుడ్ దేవతలకు మొక్కులు చెల్లించారు. అనంతరం సిద్ధికసలోని జై జంగు జైలింగు దీక్షాపరులతో కలిసి సిద్ధికసలోని గుహలోకి వెళ్లి పుణ్యస్నానం ఆచరించారు. జంగు, లింగు దేవతలు, శివలింగానికి పూజలు చేశారు. ఎంపీ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలన్నారు. జంగుబాయి దేవస్థానం అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కొందరు పని కట్టుకుని తనపై ఆరోపణలు చేస్తున్నారని, తుడుందెబ్బకు ఎలాంటి ద్రోహం చేయలేదని స్పష్టం చేశారు. ఆలయానికి రోడ్డు, తాగునీటి సౌకర్యం కల్పిస్తామని, టొప్లకసలో రూ.10లక్షలతో షెడ్డు ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో తెలంగాణ, మహారాష్ట్ర ఆలయ కమిటీ చైర్మన్లు కొడప జాకు, వెట్టి చందు, సర్పంచ్ లింబాదాస్, పూజారి హన్మంత్‌రావు, కటోడ నాగోరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రొఫెసర్ కోదండరాం.. ఎమ్మెల్సీ

- గవర్నర్ కోటాలో పదవిపై హర్షం
- స్వస్థలం నెన్నెల మండలం జోగాపూర్


కోదండరాం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు, టీజేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ ముద్దసాని కోదండరాం గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ఎంపికయ్యారు. ఆయనకు పదవీ దక్కడంపై మంచిర్యాల జిల్లా వాసులు, సన్నిహితులు, స్నేహితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలం ఊటూరు నుంచి మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం జోగాపూర్‌కు వలస వచ్చారు. తల్లిదండ్రులు జనార్దన్‌రెడ్డి, వెంకటమ్మ. ఏడుగురు సంతానంలో కోదండరాం ఒకరు. కోదండరాం 1955 సెప్టెంబర్ 5న జన్మించారు. భార్య సుశీల కాగా, వీరికి ఇద్దరు సంతానం. అందరూ ఉద్యోగ, వృత్తిరీత్యా వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డారు. ఆయన సోదరుడు రంగారెడ్డి కుటుంబం మాత్రం ప్రస్తుతం జోగాపూర్‌లోనే ఉంటోంది. బాల్యం నుంచే రాడికల్ భావజాలంతో పెరిగిన కోదండరాం ఉమ్మడి కరీంనగర్, వరంగల్, హైదరాబాద్‌లో విద్యాభ్యాసం పూర్తి చేశారు. ఉస్మానియా యూనివర్సిటీలో పొలిటికల్ సైన్స్ ప్రొఫెసర్‌గా బోధించి రిటైర్డ్ అయ్యారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమ సమయంలో రాజకీయ జేఏసీ చైర్మన్‌గా కీలకంగా వ్యవహరించారు. తెలంగాణ జన సమితి పార్టీ స్థాపించారు. ఉమ్మడి జిల్లా వాసులు అనేకమందితో సాన్నిహిత్యం ఉంది. తెలంగాణ విద్యావంతుల వేదిక, సింగరేణి ఓపెన్‌కాస్టులు, ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సమయంలోనూ ఇక్కడికి పలుమార్లు వచ్చారు. ఇప్పటికీ తమ వారసత్వంగా ఇల్లు, ఆస్తులు, భూములు ఉన్నాయి. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో మంచిర్యాల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తారనే ప్రచారం జరిగింది. తాజాగా ఎమ్మెల్సీగా ఎన్నిక కావడంపై ఆయన సన్నిహితులు, స్నేహితులు గుర్తు చేసుకున్నారు.

# ‘మంచిర్యాల–అంతర్గాం’ బ్రిడ్జి నిర్మించాలి

- మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాశ్‌రావు


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాశ్‌రావు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల కాలేజీ రోడ్డు నుంచి అంతర్గాం వరకు గోదావరి నదిపై బ్రిడ్జి నిర్మించాలని మాజీ ఎమ్మెల్యే, ఆర్టీసీ మాజీ చైర్మన్ గోనె ప్రకాశ్‌రావు డిమాండ్ చేశారు. మంచిర్యాల, అంతర్గాంల మధ్య గోదావరి నదిపై బ్రిడ్జి నిర్మాణాన్ని పోరాడి సాధించామని తెలిపారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కుమురంభీం ఆసిఫాబాద్‌తోపాటు మంచిర్యాల జిల్లాకు చెందిన ప్రజలు ఈ బ్రిడ్జి గుండా మంచిర్యాల నుంచి పెద్దపల్లి జిల్లా బసంత్‌నగర్ వరకు ప్రయాణిస్తే 45 నిమిషాలు ముందుగానే వెళ్తారని అన్నారు. 2018 ఎన్నికల సమయంలో సీఎం హోదాలో కేసీఆర్ శ్రీరాంపూర్‌లో ఇచ్చిన హామీ మేరకు బ్రిడ్జి నిర్మాణం కోసం అఖిలపక్షం ఆధ్వర్యంలో పోరాడామని అన్నారు. బ్రిడ్జి నిర్మాణానికి రూ.1.64 కోట్లు విడుదల కాగా, మూడు నెలల క్రితం టెండరు కూడా పూర్తి చేశారని తెలిపారు. ప్రస్తుతం పనులను ప్రారంభించడం వల్ల వర్షాకాలం నాటికి పిల్లర్ల నిర్మాణం పూర్తయి, బ్రిడ్జిని రెండేళ్లలో నిర్మించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ విషయమై ప్రస్తుత ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి వినతిపత్రం ఇచ్చానని అన్నారు. కొందరు మంచిర్యాల, అంతర్గాం బ్రిడ్జిని నిర్మించకుండా, ముల్కల్ల వద్ద నిర్మించాలని చూస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. దాని వల్ల ప్రజలకు మేలు జరగకపోగా కోర్టు కేసులు, భూపరిహారం ఇలా ఏళ్ల తరబడి బ్రిడ్జి నిర్మాణానికి దూరంగా ఉండాల్సిన పరిస్థితి వస్తుందని, బ్రిడ్జిని ముల్కల్లకు ఎవరు మార్చాలని అనుకుంటున్నారో తెలియడం లేదని తెలిపారు. బ్రిడ్జి నిర్మాణాన్ని ఆపాలని ఎవరైనా చూస్తే తాను ఊరుకోబోనని స్పష్టం చేశారు.

# ఖందేవ్ పుణ్యక్షేత్రానికి తొడసం వంశీయులు


మాసేమాల్ దేవతకు పూజలు చేస్తున్న తొడసం వంశస్తులు


ఖందేవుని సంప్రదాయ మహాపూజలో ఎమ్మెల్యే

నార్నూర్: తొడసం వంశస్తుల ఆరాధ్యదైవం ఖందేవ్ ఆలయ పుణ్యక్షేత్రానికి తొడసం వంశస్తులు సంప్రదాయ వాయిద్యాలతో ఎడ్లబండిపై గురువారం చేరుకున్నారు. బుధవారం రాత్రి మండలంలోని మాన్యాపూర్ వద్ద మాసేమాల్ దేవతకు ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి అక్కడే బస చేశారు. గురువారం ఉదయం పుణ్యస్నానాలు ఆచరించిన తర్వాత ఆదివాసీ గిరిజనుల ఆచారం ప్రకారం పూజలు చేశారు. మధ్యాహ్నం ఎడ్లబండిపై కొందరు.. మరి కొందరు పూజ సామగ్రితో కాలినడకన ఖందేవుని పుణ్యక్షేత్రానికి చేరుకున్నారు. సాయంత్రం నిర్వహించిన పూజ కార్యక్రమంలో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి పాల్గొన్నారు. వారితో కలిసి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ నెల ఆదివాసీ గిరిజనులకు ఎంతో పవిత్రమైందని పేర్కొన్నారు. తరతరాల నుంచి సంస్కృతి సంప్రదాయాలను కాపాడాలని కోరారు. ఖందేవు ఆలయ అభివృద్ధితో పాటు భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించడానికి తనవంతు సహాయసహకారాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో తొడసం వంశానికి చెందిన కటోడ బాపురావు, తెలంగాణరావు, తొడసం నాగోరావు, సర్పంచ్ బానోత్ గజానంద్‌నాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ కాంతారావు దుర్గే, మాజీ ఎంపీపీ మెస్రం రూప్‌దేవ్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మెస్రం హన్మంతరావు, నాయకుడు సయ్యద్‌ఖాశీం తదితరులున్నారు.




## ఆర్టీసీ బస్టాండ్‌లో అడ్డదిడ్డంగా పార్కింగ్

నిర్మల్ ఆర్టీసీ బస్టాండ్‌లో వాహనాలను అడ్డదిడ్డంగా పార్కింగ్ చేస్తున్నారు. కుటుంబ సభ్యులు, బంధువులను ద్విచక్రవాహనాలపై బస్టాండ్‌కు తీసుకువస్తున్నవారు నోపార్కింగ్ ప్లేస్‌లో బైక్‌లు పార్కింగ్ చేస్తున్నారు. దీంతో బస్సులు పాయింట్‌పైకి తీసుకురావడానికి డ్రైవర్లు ఇబ్బంది పడుతున్నారు. ఆర్టీసీ అధికారులు ఎన్ని చర్యలు తీసుకున్నా ద్విచక్రవాహనదారులు, ఆటో వాలాల తీరు మారడం లేదు.

– సాక్షి ఫొటోగ్రాఫర్ నిర్మల్

